క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన గల్ఫ్ కార్మికులు


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న గల్ఫ్‌కార్మికులు

జన్నారం: గల్ఫ్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఈ విషయం సీఎం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ శనివారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ను ఉట్నూర్‌లోని తన ఛాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి, శాసన సభ సమావేశంలో ఈ విషయం సీఎం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చినట్లు తెలంగాణ గల్ఫ్ సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు కల్లెడ భూమయ్య తెలిపారు. కార్యక్రమంలో గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు శేపూరి గోపాల్, ఉపాధ్యక్షుడు మల్లిఖార్జున్, రాష్ట్ర, జిల్లా నాయకులు మహ్మద్ హసన్, పెట్టెం రమేశ్, ఎరుకల రమేశ్‌గౌడ్, మగ్గిడి తిరుపతి, దుమల్ల ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏకాదశ రుద్రహోమం


పూజల్లో పాల్గొన్న భక్తులు

రామకృష్ణాపూర్: పట్టణంలోని శ్రీ విజయగణపతి దేవాలయంలో శనివారం చండీ పారాయణం, ఏకాదశ రుద్రహోమం, మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ధ్వజ సూర్యనారాయణ, సంతాన నాగేంద్ర మూషిక వాహన పునః ప్రతిష్ఠ పూజల్లో భాగంగా మూడు రోజులుగా పూజా కార్యక్రమాలు నిర్వహిస్తుండగా శనివారం భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వరద ఉధృతికి కొట్టుకొచ్చిన కొండ చిలువ



బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ శాంతిఖని బస్తీ అటవీ ప్రాంతానికి అత్యంత చేరువలో ఉంటుంది. బస్తీ చుట్టూరా ఏపుగా పెరిగిన తుమ్మ, ఇతర పిచ్చి మొక్కలు ఉండగా కూతవేటు దూరంలో రిజర్వు ఫారెస్టు ఉంది. విస్తారంగా కురుస్తున్న వర్షాలతో వాగులు, వంకలు ప్రమాదకరంగా ప్రవహిస్తున్నాయి. శాంతిఖని వాగు ఉప్పొంగి రోడ్డుపై నుంచి మోకాలి వరకు వరద నీరు ప్రవహించడంతో పాటు ప్రమాదకరమైన సర్పాలు వరదలో కొట్టుకొచ్చాయి. దీంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ప్రాణాంతకమైన కొండ చిలువలను బస్తీ ప్రజలు సామూహికంగా కొట్టి చంపి, ప్రాణభీతి నుంచి బయట పడ్డారు.

- ఉప్పొంగిన వాగులు, చెరువులు
- నీట మునిగిన పంట పొలాలు
- తెగిన రోడ్లు, ఇళ్లలోకి చేరిన వర్షపు నీరు
- ఇబ్బంది పడ్డ ప్రజలు

వర్ష బీభత్సం!

జిల్లా వ్యాప్తంగా శుక్రవారం రాత్రి నుంచి శనివారం మధ్యాహ్నం వరకు వర్షం బీభత్సం సృష్టించింది. రోడ్లు తెగిపోగా, పలు ఇళ్లలోకి వర్షపు నీరు వచ్చి చేరింది. వాగులు, చెరువులు ఉప్పొంగి ప్రవహించాయి. పంట పొలాలు నీట మునిగాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు పర్యటించి నష్టం వివరాలను తెలుసుకున్నారు. శిథిలావస్థకు చేరిన ఇళ్లు కూలిపోగా ప్రజలను పునరావాస కాలనీకి తరలించారు.


వరద ఉధృతికి దెబ్బతిన్న లింగన్నపేట ఎదులబంధం రోడ్డు

దండేపల్లి/చెన్నూర్‌రూరల్/చెన్నూర్/బెల్లంపల్లి/జన్నారం/భీమిని/నస్పూర్/జైపూర్/తాండూర్/మందమర్రిరూరల్/మంచిర్యాలరూరల్(హాజీపూర్): భారీ వర్షాలకు చెన్నూర్ మండలం అక్కెపల్లికి వెళ్లే దారిలో వాగుపై కాజ్‌వే మొత్తం శిథిలావస్థకు చేరి కుంగింది. పై నుంచి వరద పారడంతో ప్రజలు వాగు దాటలేక ఇబ్బందులు పడ్డారు.

- దండేపల్లి మండలం గూడెం వద్ద గోదావరి నది పరవళ్లు తొక్కుతూ ప్రవహించింది. మాదాపూర్-నర్సాపూర్ గ్రామాల మధ్య వాగుపై లోలెవల్ వంతెన వరద ఉధృతితో నీటమునిగింది. నర్సాపూర్ గ్రామానికి చెందిన శాతరాజు సతీశ్ ఇంటి గోడ కూలింది. తహసీల్దార్ రోహిత్‌దేశ్‌పాండే, ఎంపీడీవో ప్రసాద్, ఆర్‌ఐ భూమన్న పర్యటించి వరద ఇబ్బందులపై ఆరా తీశారు.
- మందమర్రిలో పలు ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు చేరడంతో సామగ్రి తడిసింది. మున్సిపల్ కమిషనర్ రాజలింగు సందర్శించి ప్రజలను అప్రమత్తం చేశారు.
- జైపూర్ మండలం టేకుమట్ల వాగుపై వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో టేకుమట్ల-షెట్‌పల్లి గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.
- జన్నారం మండలం శ్రీలంక కాలనీ చుట్టూ నీరు చేరింది. తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, ఎంపీడీవో ఉమర్‌షరీఫ్, ఎస్సై అనూష, కార్యదర్శి రాహుల్‌లు వరద ప్రాంతాల్లో పర్యటించారు. వరద ముంపు ఉన్న బుడుగ జంగాల కాలనీకి చెందిన నాలుగు కుటుంబాలను పీఆర్టీయూ భవన్‌లో ఉంచారు.
- చెన్నూర్‌లో లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా మున్సిపల్ కమిషనర్ మురళికృష్ణ సిబ్బందితో కలిసి పట్టణంలో పర్యటించారు. సహాయక చర్యలు చేపట్టారు. ఇళ్లలో చేరిన నీటిని డ్రెయినేజీలకు మళ్లించారు. శిథిలావస్థకు చేరిన గృహాల్లో నివాసం ఉంటున్న ఐదు కుటుంబాలను గుర్తించారు.
- బెల్లంపల్లిలో కాల్‌టెక్స్ శివారు రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి పక్కన క్వార్టర్ల వద్ద రోడ్డుపై మోకాలి బంటి వరద నీరు వచ్చి ఆగింది. నీటి ప్రవాహం వెళ్లడానికి వీలు లేకపోవడంతో బ్రిడ్జి అవతలి వైపు ఉన్న కల్వర్టును మున్సిపల్ కమిషనర్ రమేశ్ జేసీబీతో పగుల గొట్టించి వరద నీరు ఆగకుండా నివారించారు. రాంనగర్ వాగు బ్రిడ్జి పై నుంచి నీరు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు స్తంభించాయి. వాహనదారులు నానా తంటాలు పడ్డారు. బస్తీలోని ఓ వీధి రోడ్డుపై నిలిచిన నీటిలో వలవేసి కొందరు చేపలు పట్టారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రభుత్వ అధికారులు, సిబ్బంది పర్యటించారు.
- కడెం, ఎల్లంపల్లి ప్రాజెక్ట్ గేట్లు తెరవడంతో హాజీపూర్ మండలంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలకు అధికారులు ముందస్తుగా హెచ్చరికలు చేశారు. హాజీపూర్ తహసీల్దార్ శ్రీనివాస రావుదేశ్‌పాండే, హాజీపూర్ ఎస్సై స్వరూప్‌రాజ్ గిర్దావర్లు మంగ, ప్రభులు గ్రామాల్లోని పరిస్థితులను సమీక్షించారు. ముల్కల్ల శివారులో జాతీయ రహదారిపై ఓ భారీ చెట్టు నేలకొరిగింది. సీఐ ఆకుల అశోక్, ఎస్సై స్వరూప్‌రాజ్ ఆధ్వర్యంలో జేసీబీతో చెట్ల కొమ్మలను తొలగించారు.
- తాండూర్ మండలంలోని నర్సాపూర్ గ్రామానికి వెళ్లే మార్గంలోని భీమన్న వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఆ వైపు వెళ్లి ప్రమాదం బారిన పడకుండా పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. రేచిని బారేపల్లి సమీపంలోని వాగు ఉధృంగా ప్రవహిస్తుండటంతో ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అచ్చలాపూర్‌లోని బామండ్లపల్లి నరేష్ ఇంట్లోకి వర్షపు నీరు చేరగా, ఎస్సై కిరణ్‌కుమార్ బాధితుడి ఇల్లును పరిశీలించారు.


భీమారం: వరద నీటిలో లక్ష్మి


గండిపడ్డ బూర్గుపల్లి-దాంపూర్ ప్రధాన రహదారి

భీమారం: భీమారం మండలంలో బూర్గుపల్లి-దాంపూర్ మధ్య గల కంకరరోడ్డుకు గండిపడింది. రాకపోకలు నిలిచి ప్రజలు ఇబ్బంది పద్దారు. భీమారం-ఆవిడం ప్రధాన రోడ్డులో నర్సింగాపూర్ వద్ద గల రోడ్డు డ్యాం పై నుంచి వరదనీళ్లు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. కొత్త చెరువులోకి భారీగా వరద నీళ్లు వచ్చి చేరడంతో నిండు కుండలా మారింది. ఊర చెరువు వాగు (ఒర్రె) ఉప్పొంగి సమీపంలోని కొత్తగుడిసెల్లోకి వరదనీళ్లు చేరాయి.


కాజ్ వే పై నుంచి ప్రవహిస్తున్న తోళ్లవాగు

నస్పూర్:పట్టణ పరిధిలో వినూత్న కాలనీ వద్ద కాజ్‌వే పై నుంచి తోళ్ల వాగు ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సీసీసీ కార్నర్ వద్ద ఎస్‌ఎల్‌ఆర్ కాలనీలో డ్రెయినేజీ నీరు రోడ్డుపై చేరింది. నర్సయ్య భవన్ ఎదురుగా గల గాయత్రి నగర్‌లో డ్రెయినేజీ నీరు పలు ఇళ్లలోకి చేరింది.


మందమర్రిరూరల్: ఇళ్లలోకి చేరిన వరద నీరు


దండేపల్లి: లోలెవల్ వంతెనపై ప్రవహిస్తున్న వరద


బెల్లంపల్లి: ఉధృతంగా శాంతిఖని వాగు

వేమనపల్లి: మండలంలో సడెన్కమోరి, ఆర్ అండ్‌బీ రోడ్డు, ఎంచపాయ, కొత్తపల్లి వాగు వరకు పొలాలు, పత్తి చేళ్లు చెరువులను తలపించాయి. నాగారాం లోతొర్రె వద్ద రోడ్డుపై నుంచి లింగాల రూట్‌లో కల్వర్టులపై నుంచి వరద ప్రవహించడంతో కోతకు గురయ్యాయి. బెల్లంపల్లి నియోజకవర్గ కేంద్రానికి రాకపోకలు స్తంభించాయి. ఎంపీడీవో కుమారస్వామి, ఆర్‌ఐ కాలిక్, పంచాయతీ కార్యదర్శి అశోక్ అక్కడికి వెళ్లి రోడ్డుకు అడ్డంగా ఎడ్లబండిని ఉంచి రాకపోకలు నిలిపివేశారు.


ఉధృతంగా చామనపల్లి పెద్దవాగు


మత్తడి వద్ద కాలువ తీస్తున్న అధికారులు

లక్సెట్టిపేట: పట్టణంలోని మస్తాన్ గూడ, బీట్ బజార్, గోదావరి రోడ్, పలు ప్రాంతాల్లో ఇళ్లలోకి నీళ్లు చేరాయి. తొమ్మిదో వార్డులోని దర్శనాల శ్రీనివాస్ ఇంట్లోకి వర్షం నీరు చేరడంతో కలెక్టర్ కుమార్ దీపక్, తహసీల్దార్ దిలీప్‌కుమార్, ఎస్సై సతీశ్ పరిశీలించి వివరాలు సేకరించారు. డీసీపీ బాస్కర్, సీఐ రమణామూర్తి పట్టణంలోని వార్డుల్లో, కొమ్ముగూడెంలో తిరిగారు. కొమ్ముగూడెం గ్రామ చెరువు నిండిపోవడంతో మత్తడి వద్ద జేసీబీతో అధికారులు కాలువను తవ్వించడంతో ప్రమాదం తప్పింది. పోతపల్లి గ్రామం మధ్యలో వాగు నీరు రోడ్డుపై పారడంతో గ్రామానికి రాకపోకలు స్తంభించాయి. జెండవెంకటాపూర్ గ్రామ చెరువు నిండడంతో ప్రజలు అటువైపు వెళ్లొద్దని జీపీ సిబ్బంది కాపలా ఉన్నారు.


జన్నారం: కాలనీవాసులతో అధికారులు


చెన్నూర్: డ్రెయినేజీలుశుభ్రం చేయిస్తున్న కమిషనర్

కుమ్మరవాగు ప్రాజెక్టు ఎడమ కాలువకు గండి


ఆవుడంలో కూలిన ఇళ్లు

నెన్నెల: నెన్నెలలో ఏకధాటిగా నాలుగు గంటల పాటు కుండపోత వర్షం కురిసింది. భారీ వర్షానికి జనజీవనం స్తంభించింది. లంబాడితండా ఎర్రవాగు, కుమ్మరివాగు, జోగాపూర్ మత్తడి వాగులు ఉప్పొంగి ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వర్షం దాటికి వాగుల పరివాహక ప్రాంతాల్లో వందల ఎకరాల్లోని పత్తి, వరి, కంది పంటలు నీట మునిగాయి. ఇళ్లలోకి నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మోటార్ల సాయంతో ఇళ్లలోకి చేరిన నీటిని బయటకు పంపేందుకు నానా తంటాలు పడ్డారు. కుమ్మరవాగు ప్రాజెక్టు ఎడమ కాలువకు కొత్తగూడం వద్ద గండి పడటంతో నీళ్లనీ తహసీల్దార్, ఎంపీడీవో, వ్యవసాయ కార్యాలయాల చుట్టూ చేరాయి. పాటి వాడ, కోణంపేట, బోగంపల్లి, దమ్మిరెడ్డిపేట గ్రామాల చుట్టూ నీరు చేరడంతో అక్కడి ప్రజలు జల దిగ్బంధంలో చిక్కుకున్నారు. మరిన్ని వర్షాలు కురిస్తే ఏం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

పార్‌పల్లి-ఎదులబంధం దారిలో తెగిన రోడ్డు

- పది గ్రామాలకు నిలిచిన రాకపోకలు


దెబ్బతిన్న రోడ్డును పరిశీలిస్తున్న ఎస్సై

కోటపల్లి: మండలంలోని ప్రాణహిత, గోదావరి నదుల్లో వరదనీరు చేరడంతో ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. నక్కలపల్లి గ్రామానికి వెళ్లే దారిలో లోతొర్రె వాగు ఉప్పొంగి ప్రవహించడంతో నక్కలపల్లి, బ్రహ్మణపల్లి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. నక్కలపల్లి అటవీప్రాంతంలో వరద ఉధృతికి కల్వర్టు ప్రమాదకరంగా మారడంతో ఎస్సై రాజేందర్ సిబ్బందితో సందర్శించి రాకపోకలను నిలిపివేసి బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఎదులబంధం లింగన్నపేట గ్రామాల మధ్య తుతుంగ వాగు ఉధృతిగా ప్రవహిస్తుండడంతో ఎదులబంధం, సిర్సా, పుల్లగామ, రొయ్యలపల్లి, ఆలుగామ, జనగామ, సుపాక, వెంచపల్లి గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. పత్తిపంటలు నీటమునిగాయి. అధికారులు స్పందించి నష్టపరిహారం అందేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

కూలిన క్వార్టర్ శ్లాబ్



బెల్లంపల్లి: భారీ వర్షాలకు బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య క్యాంపు కార్యాలయంగా వినియోగిస్తున్న ఏఎంసీ ఏరియాలోని సింగరేణి కంపెనీ క్వార్టర్ పై కప్పు శుక్రవారం రాత్రి కూలింది. అదృష్టవశాత్తు ఆ క్వార్టర్‌లో ఎవరూ నివాసం ఉండకపోవడంతో తృటిలో ప్రమాదం తప్పింది.

బొగ్గుబాయి వార్తలు

రేపు వైద్య శిబిరం

శ్రీరాంపూర్: నస్పూర్ కాలనీలోని మనోరంజన్ సముదాయంలో సోమవారం ఆయుర్వేద వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు డీజీఎం(పర్సనల్) అనిల్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీపీ, షుగర్, కీళ్ల నొప్పులు తదితర దీర్ఘకాలిక వ్యాధులకు ఇక్కడ పరీక్షలు నిర్వహించబడతాయన్నారు. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు

అధికారుల పోరుకు సంఘీభావం

శ్రీరాంపూర్: పర్ఫార్మెన్స్ రిలేటెడ్ పే(పీఆర్పీ) సాధన కోసం సింగరేణి అధికారులు చేపట్టిన పోరుబాటకు మద్దతిస్తున్నట్లు గుర్తింపు సంఘం ఏఐటీయూసీ కేంద్ర ఉప ప్రధాన కార్యదర్శులు వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి షేక్ బాజీసైదాలు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బొగ్గు ఉత్పత్తి, లక్ష్యాల సాధనలో అధికారులు కీలకంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. కోలిండియాలో పీఆర్పీ చెల్లించిన కూడా సింగరేణిలో ఇప్పటివరకు చెల్లించకపోవడం అన్యాయం అన్నారు. వెంటనే స్పందించి పీఆర్పీ చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగులు పనితనం మెరుగుపర్చుకోవాలి


మాట్లాడుతున్న జీఎం దేవేందర్

బెల్లంపల్లి: సింగరేణి ఉద్యోగులు, కార్మికులు పనితనాన్ని మెరుగు పర్చుకోవాలని మందమర్రి ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్, మల్టీ డిపార్ట్‌మెంటల్ కమిటీ చైర్మెన్ జి.దేవేందర్ అన్నారు. శాంతిఖని గనిపై శనివారం మల్టీ డిపార్ట్‌మెంటల్ కమిటీ పర్యటించింది. ఈ సందర్భంగా గని పై షిఫ్టుల వారీగా నిర్వహించిన మల్టీ డిపార్ట్‌మెంటల్ కమిటీ సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కంపెనీ సూచించిన సలహాలు, సూచనలను గని ఉద్యోగులు పాటించడం వల్ల బొగ్గు ఉత్పత్తి ,ఉత్పాదకత పెరుగుతుందన్నారు. కంపెనీ భవిష్యత్, ప్రణాళికలు, కంపెనీ ముందున్న సవాళ్లు, లక్ష్యాలను సాధించడానికి చేపట్టబోయే పనులపై సుదీర్ఘంగా చర్చించారు. కార్యక్రమంలో ఎస్‌ఓటు జీఎం విజయ్ ప్రసాద్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్, శాంతిఖని గ్రూప్ ఆఫ్‌మైన్స్ ఏజెంట్ అబ్దుల్ ఖదీర్, డీజీఎం(ఈఅండ్ఎం) బాలాజీ భగవతి, డీజీఎం(ఎఫ్ అండ్‌ఏ) ఆర్‌వీఎస్ ఆర్‌కే ప్రసాద్, ఏరియా పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యాంసుందర్, ఎస్ఈ (ఐఈ) కె.కిరణ్‌కుమార్, ఉద్యోగులు, కార్మికులు ,సిబ్బంది పాల్గొన్నారు.

యంత్రాల పనిగంటలు పెంచాలి


మాట్లాడుతున్న జీఎం ఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్: యంత్రాల పనిగంటలు మరింతగా పెంచాలని శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్ తెలిపారు. శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గని, సీహెచ్‌పీలలో శనివారం మల్టీ డిపార్ట్‌మెంటల్ సమావేశాల్లో పాల్గొని మాట్లాడారు. సంస్థ స్థితిగతులు తెలియజేయడం కోసమే ఈ సమావేశాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం బ్రాంచ్ కార్యదర్శి షేక్ బాజీసైదా, కమిటీ కన్వీనర్ ఏవీ రెడ్డి, శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టు అధికారి చిప్ప వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా వాజ్‌పేయి వర్ధంతి


నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

నస్పూర్/మంచిర్యాలటౌన్: దివంగత మాజీ ప్రధాని అటల బిహారి వాజ్‌పేయి వర్ధంతిని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో, నస్పూర్ పట్టణ పరిధిలోని సంఘం మల్లయ్య పల్లెలో ఆయన చిత్ర పటానికి బీజేపీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో బీజేపీ రాష్ట్ర నాయకులు రఘునాథ్ వెరబెల్లి పాల్గొన్నారు. అనంతరం సంఘం మల్లయ్య పల్లెలో నూతనంగా ఏర్పాటు చేసిన బీజేపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రఘునాథ్ మాట్లాడుతూ.. వాజ్‌పేయి ఆశయాలను నెరవేరుస్తూ నరేంద్రమోదీ ప్రభుత్వం ముందుకు సాగుతుందని, రాజకీయ పార్టీల నేతలకు విలువలను నేర్పిన గొప్ప నాయకుడు వాజ్‌పేయి అని కొనియాడారు. కార్యక్రమాల్లో జిల్లా కేంద్రంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు అమిరిశెట్టి రాజ్‌కుమార్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గాజుల ముఖేశ్ గౌడ్, బియ్యాల సతీశ్ రావు, తుల ఆంజనేయులు, జయరామరావు, జోగుల శ్రీదేవి, నస్పూర్‌లో జిల్లా ప్రధాన కార్యదర్శి పట్టి వెంకటకృష్ణ, జిల్లా ఎస్సీ సెల్ నాయకులు మిట్టపల్లి మొగిళి, పట్టణ అధ్యక్షుడు సత్రం రమేశ్, నాయకులు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: పట్టణంలోని బీఎంఎస్ ఆఫీస్‌లో వాజ్‌పేయి వర్ధంతిని బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి బీజేపీ చెన్నూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి దుర్గం అశోక్ హాజరై నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు నరేష్, సీనియర్ నాయకులు డీవీ దీక్షితులు, మల్యాల రాయమల్లు, శ్రీనివాస్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.


షణ్ముఖ్


ప్రభన్విత్-కుట్టి


దండేపల్లి లో కృష్ణాష్టమి వేడుకల్లో పిల్లలు, పెద్దలు


హిమాన్ష్


ఆవుల శ్రీనిథ్, భీమారం


శ్రీనిధి


గోపిక వేషధారణలో ఆధ్యశ్రీ


రుద్రాన్ష్

ఘనంగా కృష్ణాష్టమి

మంచిర్యాలఅర్బన్/భీమారం/దండేపల్లి/తాండూర్/మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లా వ్యాప్తంగా శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. వైష్ణవాలయాల్లో ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు తమ ఇళ్లల్లో బొమ్మ కొలువులను ఏర్పాటు చేసి సంస్కృతి సంప్రదాయల్లో భాగంగా చిన్నారులను శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో అలంకరించి మురిసిపోయారు. పలుచోట్ల ఉట్టికొట్టి కార్యక్రమం నిర్వహించారు.